క్లుప్తంగా

పథకాలు వర్తింపజేయాలి

బూర్గంపాడు: కేసులతో సంబంధం లేకుండా మలి దశ తెలంగాణ ఉద్యమకారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఉద్యమకారుడు తిప్పన సిద్ధులు డిమాండ్ చేశారు. బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులను ఇచ్చి పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఉద్యమకారులు పొడియం నరేందర్, తోడేటి సత్యనారాయణ, నల్లమోతు సురేష్, బాగి వెంకట్రావు, భూపెల్లి నర్సింహారావు, మర్రి సాంబారెడ్డి, శ్రీపాద రవికుమార్, పారుపల్లి శ్రీనివాసరావు, సాలయ్య, అబ్దుల్ అలీ, దామోదర్‌రెడ్డి, వెంకటరాములు, పుల్లయ్య, రాఘవులు, రాంమోహన్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

దమ్మపేట: రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్థికంగా నష్టపోయిన ఆటో కార్మికులకు ప్రతి నెలా రూ.4500ల జీవనభృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ, షఫీ, కరణ్, నాని, కుటుంబరావు పాల్గొన్నారు.

చండ్రుగొండ: ఉచిత బస్సుప్రయాణం కారణంగా ఆదాయం కోల్పోయిన ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం జీవనభృతి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ ప్రభుత్వాన్ని కోరారు. చండ్రుగొండలో ఆటోకార్మికులతో కలిసి ఈ నెల 25న కలక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నా కరపత్రికను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ వెంకటాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేతాజీ జయంతి

దమ్మపేట: మండల కేంద్రంలో స్వాతంత్ర్య పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం దమ్మపేట గ్రామంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచారు. అనేక పోరాటాలు చేసిన సమరయోధుడు బోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో అత్యం వెంకటేశ్వరరావు, చిన్నశెట్టి సత్యనారాయణ, యార్లగడ్డ భాస్కరరావు, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, చామర్తి గోపిశాస్త్రి, పెదబాబు, మధు, వెంకట్, నాగేంద్ర పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ అశ్వారావుపేట మండల యూత్ అధ్యక్షుడిగా దండా బత్తుల నరేష్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆ పార్టీ అశ్వారావుపేట అసెంబ్లీ యూత్ అధ్యక్షులు కోరంపల్లి చెన్నారావు నియమించగా, ఈ నియామక పత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా నరేష్ అందుకున్నారు.

కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా దర్శి..

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దర్శి సాంబశివరావు కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా కిసాన్ చైర్మన్ ఏలూరి కోటేశ్వరావు ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటు నమోదు చేసుకోవాలి

మణుగూరురూరల్: ఖమ్మం–నల్లగొండ–వరంగల్ ప్రాంత ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువకులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సీపీఐ పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు జంగం మోహన్‌రావు, సుధాకర్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు సోందే కుటుంబరావు, ఎస్‌కె.సర్వర్, ఎస్‌వి.నాయుడు, మంగి వీరయ్య, ఆధర్ల రాములు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధమవ్వాలి

ములకలపల్లి: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ మండలకమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, గొగ్గెల ఆదినారాయణ, రావూజా. నిమ్మల మధు, డిష్ రాంబాబు, మంచాల సారయ్య, భైరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

అశ్వాపురం: మనుబోతులగూడెం పంచాయతీలోని వేములూరు గ్రామంలో మండల ఆయుర్వేద వైద్యాధికారి జీ.అరుణ ఆధ్వర్యంలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రక్తహీనత, ఆయుర్వేద జీవనశైలి, ఔషధాల విశిష్టత, వాతావరణమార్పుల ద్వారా శారీరకంగా వచ్చే వ్యాధులు, గృహ చిట్కాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. పారామెడికల్ సిబ్బంది జీ.రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం లేని ప్రకృతి వనాలు

- నిర్వహణ లేకపోవడంతో ఎండుతున్న మొక్కలు
- దృష్టి సారించకపోతే మరింత నష్టం



ఎండుతున్న మొక్కలతో మోతె పట్టీనగర్ పల్లె ప్రకృతి వనం

బూర్గంపాడు: పల్లె ప్రకృతి వనాలు పచ్చదనం కోల్పోతున్నాయి. సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవటంతో మొక్కలు ఎండిపోతున్నాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు పల్లె ప్రకృతి వనాల నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి నాటిన మొక్కలు అక్కరకు రాకుండా పోతున్నాయి.

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి ఒక పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూములలో, దాతలు ఇచ్చిన భూములలో మొక్కలు నాటి వాటిని వనాలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పల్లెప్రకృతి వనాల్లో నాటేందుకు అవసరమైన మొక్కలను ఆయా గ్రామపంచాయతీలలో నర్సరీలు ఏర్పాటు చేసి పెంచారు. నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలలో మొక్కలకు నీరు అందించేందుకు ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టర్‌ను, వాటర్ ట్యాంకర్‌ను కొనుగోలు చేశారు. పల్లె ప్రకృతి వనాలలోని మొక్కలను సంరక్షించకపోతే పంచాయతీ సర్పంచ్‌లపై, కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని అప్పటి ప్రభుత్వం హెచ్చరికలు చేసింది. కొత్త గ్రామపంచాయతీరాజ్ చట్టంలో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలను కూడా పాలకవర్గాలకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిర్వహణపై నిర్లక్ష్యం

నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, పర్యవేక్షణ మూడేళ్ల క్రితం వరకు సజావుగానే సాగింది. మండల, జిల్లా స్థాయి అధికారులు తరచూ పల్లెప్రకృతి వనాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. చాలాచోట్ల పల్లె ప్రకృతి వనాలలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచాయి. కాని గత ఏడాది కాలంగా పల్లె ప్రకృతి వనాల నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొక్కలకు నీళ్ల పట్టడం, కలుపు మొక్కలు తొలగించటం వంటి పనులను గ్రామపంచాయతీల సిబ్బంది పట్టించుకోవటం లేదు. దీంతో చాలాచోట్ల మొక్కలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు గ్రామపంచాయతీల నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతున్నాయి. చాలాచోట్ల పల్లె ప్రకృతి వనాలలోని మొక్కలను కూడా కొందరు నరికివేస్తున్నారు. అయినప్పటికీ పాలకవర్గాలు పట్టనట్లుగా వ్యవహరిస్తోంది.

పల్లె ప్రకృతి వనాలను కాపాడుకోవాలి



పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను పరిరక్షించుకోవాలి. మొక్కలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకోవాలి. గ్రామపంచాయతీ పాలకవర్గాలు, అధికారులు పల్లె ప్రకృతి వనాలపై దృష్టి పెట్టాలి. మొక్కలకు ఎండకాలంలో నీరు పెట్టాలి.

– మాగంటి వెంకటేశ్వరరావు, మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్

చర్యలు తీసుకుంటాం



మొక్కల సంరక్షణకు రెండేళ్ల పాటు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో కూలీలను కేటాయించారు. ఇప్పుడు గ్రామపంచాయతీ సిబ్బందే మొక్కల సంరక్షణ బాధ్యతలు చూడాల్సి వస్తుంది. పారిశుధ్య పనులు, ఇతర పనులతో పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో పల్లె ప్రకృతి వనాలకు కేటాయించలేకపోతున్నాం. పంచాయతీ పాలకవర్గాల సమన్వయంతో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం.

– సునీల్ శర్మ, మండల పంచాయతీ అధికారి

ఇష్టపడి చదివితే భవిష్యత్



చండ్రుగొండ: విద్యార్థినులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చండ్రుగొండ: కష్టం అనుకోకుండా ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విద్యార్థులకు సూచించారు. మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థులు తలుచుకుంటే సాధించలేనిది ఏది లేదన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఏడాది పరీక్షలకు ముందు 20 రోజులపాటు అల్పాహారం అందించేందుకు రూ.10 వేలు వితరణగా అందించారు. అనంతరం ఎమ్మెల్యే జారేను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమారి, కాంగ్రెస్ మండల నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, ఉప్పతల ఏడుకొండలు, సంకా శంకర్, బడుగు కృష్ణవేణి పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: విద్యార్థులు చదువులలో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న బసవయ్య, పాఠశాల హెచ్‌ఎం ఆనంద్, నాయకులు రమణ, వెంకటేశ్వర్లు, మామిళ్లపల్లి లక్ష్మణరావు, నాగేశ్వరరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో బాధ్యులకు అందించారు. అనంతరం సభలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. పట్టణంలో అవసరమైన చోట కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి, సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. రామాలయం దగ్గరలో కరకట్టపై ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కాభవనాలు నిర్మించాలని కోరారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు పంపిణీ, ఇంటి పన్నులు విధించడం, కరెంటు స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగింపు, చెడిపోయిన చేతిపంపులకు మరమ్మతులు చేయాలని తదితర వాటిపై విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు శరత్ బాబు, పట్టణ కమిటీ సభ్యుడు చుక్కా మాధవరావు, ఎస్‌డీ ఫిరోజ్, జి.లక్ష్మణ్, శాఖ కార్యదర్శులు బి.ధర్మారావు, ఏ.లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

నక్సల్స్‌కు సహకరించొద్దు..



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రవీందర్

గుండాల: నక్సల్స్, సంఘ విద్రోహశక్తులకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుండాల సీఐ రవీందర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి గొత్తికోయ గ్రామమైన అడవిరామారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోకి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమకు తెలియజేయాలని, పరిష్కార మార్గం చూపుతామని అన్నారు. ప్రభుత్వం కలించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను పనులకు పంపకుండా చదివించాలని సూచించారు. ఆయన వెంట ఆళ్లపల్లి ఎస్సై రతీష్, సిబ్బంది ఉన్నారు.

రాహుల్‌గాంధీని అడ్డుకోవడం అప్రజాస్వామికం

మణుగూరురూరల్: అస్సాంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రను బీజేపీ గుండాలు అడ్డుకోవడం, దాడులకు పాల్పడడం అప్రజాస్వామికం అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ప్రాంతంలో ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బైఠాయించి రాస్తారోకో చేపట్టి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీని దేవాలయం లోపలికి వెళ్ళకుండా అడ్డుకోవడం అస్సాం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాటిబోయిన నాగేశ్వరరావు, బట్టా విజయ్‌గాంధీ, పీరినాకి నవీన్, పుచ్చకాయల శంకర్, చింతల కృష్ణ, ఆవుల సర్వేశ్వరరావు, కూచిపూడిబాబు, పాలమూరి రాజు, గుడిపూడి కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే పాయం, కాంగ్రెస్ నాయకులు

భద్రాచలంటౌన్: భారత్ జోడో న్యాయ్ యాత్రలో బీజేపీ నాయకులు రాహుల్ గాంధీపై చేసిన దాడిని యూత్ కాంగ్రెస్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు చింతిరాల సుధీర్ మంగళవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. బీజేపీ గుండాలు భౌతిక దాడికి యత్నించడమంటే ఇది ప్రజాస్వామ్యమా లేక అరాచకమా అని ప్రశ్నించారు. రాహుల్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు.

27, 28 తేదీల్లో భగీరథ నీటి సరఫరా నిలిపివేత

అశ్వాపురం: ఈ నెల 27, 28 తేదీలలో పినపాక నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్‌భగీరథ గ్రిడ్ ఏఈ ప్రశాంత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అశ్వాపురం మండలం రథంగుట్ట వద్ద ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పంప్‌హౌస్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా 27 ఉదయం నుంచి 28 సాయంత్రం అన్ని గ్రామాలకు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

‘ఉర్సు’కు ఆహ్వానం

కరకగూడెం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో హజరత్ అలీ బాబా దర్గా వద్ద నేడు నిర్వహించనున్న మహాగంధోత్సవ జాతర ఉర్సుకు హాజరుకావాలని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును నిర్వాహకులు మహమ్మద్ ఫారుఖ్ ఆహ్వానించారు. మంగళవారం కుర్నవల్లిలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రం అందించారు. కార్యక్రమంలో సమత్ మోతె సర్పంచ్ ఇర్ప విజయ్ కుమార్, చిరుమళ్ల సర్పంచ్ పాయం నర్సింహారావు, బీఆర్‌ఎస్ యువజన మండల అధ్యక్షుడు గుడ్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బూర్గంపాడు: బూర్గంపాడు మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని మంగళవారం సారపాక వాసవి క్లబ్‌లో ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు పచ్చిపులుసు వెంకటసుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీ అధ్యక్షుడిగా భూమా వెంకట చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కేతేపల్లి ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా దోసపాటి మల్లిఖార్జున్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా బండారు కృష్ణయ్య వ్యవహరించారు. నూతన కమిటీని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

భద్రాద్రి సమస్యలపై దృష్టి సారించండి

భద్రాచలంఅర్బన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం అభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి లేదని, ఇక్కడి సమస్యలపై నిర్లక్ష్యం చూపుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ఇక భద్రాచలంలో రాముడి, స్థానికుల సమస్యలపై ప్రభుత్వాలు ఆలోచించే దిశగా ప్రజలు ఒత్తిడి చేయవలసిన సమయం ఆసన్నమైందన్నారు. రామాలయ అభివృద్ధి, గోదావరి కరకట్ట, పోలవరం ముంపు బాధితుల సమస్య, ఆంధ్రాలో ఉన్న 5 గ్రామ పంచాయతీలను భద్రాచలంలో కలపడం తదితర సమస్యలపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆదుకోవాలి..

గుండాల: గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ మండల నాయకులు యాసారపు వెంకన్న, పర్శిక రవి, గడ్డం లాలయ్యలు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోడ్లకు ఇరువైపులా మొక్కలకు నీళ్లు పోస్తుండగా బోల్తా పడిన క్రమంలో మృతి చెందడం విషాదకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొండరెడ్ల స్థితిగతులపై నివేదిక



అధికారులతో సమావేశమైన తహసీల్దార్.

దమ్మపేట: కొండరెడ్ల జీవన స్థితిగతుల వివరాలపై నివేదిక తయారుచేయడానికి తహసీల్దార్ ముజాహిద్ అధ్యక్షతన అధికారులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పంచాయితీరాజ్, వ్యవసాయ, బ్యాంక్, తాగునీటి, ఆరోగ్య శాఖల అధికారులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం–జన్‌మన్ పథకంలో భాగంగా ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కొండరెడ్ల పూర్తి జీవన స్థితిగతులపై చర్చించారు. దీనిపై 44 పాయింట్లతో నివేదికను తయారు చేశామని తహసీల్దార్ తెలిపారు. ఈ నివేధికను బుధవారం ఐటీడీఏ పీఓకు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే..



ఉత్తమ అధికారులు, ఉద్యోగులు

మణుగూరురూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా అధికార ప్రతినిధి ఎస్.రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన ఉత్తమ ఉద్యోగుల వివరాలను వెల్లడించారు. ఉత్తమ సింగరేణియన్‌గా కేసీహెచ్‌పీలో కన్వేయర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న సుందర్ రాజన్ నల్లస్, ఉత్తమ అధికారిగా పీకే ఓసీ–4 ఎస్‌ఈ(ఎస్‌ఎంఎంసీ) సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డిలు ఎంపికయ్యారు. ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా నక్క సుమిత్ (ఈపీ ఆపరేటర్, పీకేఓసీ–2), వెనిగల్ల రాజశేఖర్ (ఈపీ ఎలక్ట్రిషియన్, పీకేఓసీ–2), దుడ్డుకురు మురళి (ఈపీ ఎలక్ట్రిషియన్, పీకేఓసీ–2), గడ్డం శ్రీహరిబాబు (ఫిట్టర్, మణుగూరు ఓసీ), షేక్ చాంద్ పాషా (అసిస్టెంట్ ఫోర్‌మెన్, కేపీయూజీ), జక్కం రమేష్ (ఫిట్టర్, కేసీహెచ్‌పీ), ఆర్.రాంబాబు (పీఏ టూ జీఎం, జీఎం కార్యాలయం), పి.వెంకట శివరామరాజు (ఫిట్టర్, ఏరియా వర్క్‌షాప్)లు ఎంపికయ్యారు. వీరిని పీవీకాలనీ కమ్యూనిటిహాల్ ప్రాంగణంలో జరిగే వేడుకల్లో ఏరియా జీఎం దుర్గం రామచందర్ చేతుల మీదుగా, సుందర్ రాజన్, శ్రీనివాస్‌రెడ్డిలను కొత్తగూడెం హెడ్డాఫీస్‌లో జరిగే వేడుకల్లో సీఅండ్‌ఎండీ ఎస్.బలరాం చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి సన్మానిస్తారు.

సర్వసభ్య సమావేశం

అన్నపురెడ్డిపల్లి: మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఎంపీపీ సున్నం లలిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ సూచించారు. గ్రామాల్లోని సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


జీపీడీపీ ప్లాన్‌కు ఆమోదం



అశ్వాపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ ముత్తినేని సుజాత

అశ్వాపురం: మండల కేంద్రంలోని అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ బాణోత్ శారద అధ్యక్షతన జీపీడీపీ తుది గ్రామసభ నిర్వహించారు. జీపీడీపీ ప్లాన్‌కు ఆమోదం తెలిపారు. ఈ గ్రామసభకు ఎంపీపీ సుజాత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచ్ భూక్యా చందూలాల్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖదీర్, ఎంపీటీసీ గంగాభవాని, పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య, వార్డు సభ్యులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, ఐకేపీ వీఓఏలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



దమ్మపేట: ములకలపల్లి స్టేషన్ నుంచి దమ్మపేట స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై సాయికిషోర్‌రెడ్డి మంగళవారం నూతన ఎస్సైగా తన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సైని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలసి అభినందలు తెలిపారు.

నాణ్యత లేని పనుల అడ్డగింత

దమ్మపేట: మండలంలోని మందలపల్లి గ్రామం, ప్రకాష్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మనఊరు-మనబడి అభివృద్ధి పనుల్లో భాగంగా నాణ్యత లేని ఎర్ర ఇసుకతో టాయిలెట్ స్లాబ్ నిర్మాణం చేస్తుండగా.. ఆ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ పనుల పర్యవేక్షకుడు అయిన ఇరిగేషన్ ఏఈ నాగేంద్రకు ఫోన్ ద్వారా తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏఈ నాగేంద్రపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో ఏఈ తాత్కాలికంగా పనులను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఏఈ నాగేంద్రను వివరణ కోరగా కాంట్రాక్టర్ తనకు సమాచారం ఇవ్వకుండా నాణ్యతలేని ఇసుకతో పనులు ప్రారంభించారని తెలిపారు. తగు విచారణ జరిపి ఇలాంటి చర్యలు మరలా పునరావృతం కాకుండా చేస్తానని తెలియజేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కరకగూడెం: మండలంలోని అనంతారం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పాఠశాలలోని ఉపాధ్యాయులు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేశారు. రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఈ స్టడీ మెటీరియల్స్ ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రఘురాం ప్రసాద్, ఉపాధ్యాయులు రాజా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

మణుగూరురూరల్: ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిబ్రవరిలో నిర్వహించే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లెం కోటి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న భూమి, విద్య, ఉద్యోగ, ఉపాధి, నిరుద్యోగ సమస్యలపై, రియల్ ఎస్టేట్ ఆగడాలపై నియోజకవర్గ స్థాయిలో భారీ ర్యాలీకి పిలుపునిచ్చినట్లు తెలిపారు. త్వరలోనే తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో నిలబడే ఆదివాసీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నామన్నారు. తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుమన్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



చర్లరూరల్: వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం..



చర్ల: కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అధికారులు

చర్ల: కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ భద్రాచలం ప్రతినిధి దుర్గాప్రసాద్ కోరారు. కేంద్రం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మా సంకల్పం-వికసిత భారతం పేరిట ఏర్పాటు చేస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా మంగళవారం మండలంలోని దేవరాపల్లి, కుదునూరు గ్రామాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలువుతున్న ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, దీన్ దయాల్ ఉపాధ్యాయ అంత్యోదయ యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి కౌశల్ వికాష్ యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన, అంత్యోదయ అన్న యోజన పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన లిమిటెడ్ కంపెనీ భద్రాచలం, వైద్య ఆరోగ్యశాఖ సత్యనారాయణపురం, పోస్టల్‌శాఖ సత్యనారాయణపురానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో..

చర్లరూరల్: వికసిత భారత సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం చర్ల మండలంలోని దేవరపల్లి గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి.. ముఖ్యంగా ఆయుష్మాన్ భరత్ హెల్త్ కార్డు గురించి అవగాహన కల్పించారు.

అనంతరం మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్‌ఈఓ బాబూరావు, ఎంఎల్‌హెచ్‌పీ పార్వతి, హెల్త్ అసిస్టెంట్లు వేణు, సమ్మక్క, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.